క్లుప్తంగా

సీసీ రోడ్డుకు భూమిపూజ



మూలపేటలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మూలపేట గ్రామానికి అవసరమయ్యే మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు పేర్కొన్నారు. మూలపేటలో కాండ్రేగుల తమ్మునాయుడు ఇంటి నుంచి నాగన్న వీధి మీదుగా సాంబమూర్తి ఆలయం వరకు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, సన్యాసినాయుడు, కాండ్రేగుల శ్రీనివాసరావు, మొల్లేటి గోవిందరావు, నాని, హైమావతి పాల్గొన్నారు.

నేత్ర రోగులకు కళ్లజోళ్ల పంపిణీ



ఒంపోలులో కళ్లజోళ్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మునగపాక : ప్రతి ఒక్కరూ కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డపు శ్రీరామమూర్తి కోరారు. మండలంలోని ఒంపోలు సచివాలయంలో ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో భాగంగా పలువురు కంటి పరీక్షలు చేసుకున్నారు. వారికి అవసరమయ్యే కళ్లజోళ్లను మంగళారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ప్రతి నేత్రరోగికి ప్రభుత్వం పలు సేవలందిస్తుందన్నారు. సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారం జానకీరామ్, ఏఎన్ఎం జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈవీఎం ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన



చూచుకొండలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక : మండలంలోని చూచుకొండ, గణపర్తి గ్రామాల్లో అధికారులు మంగళవారం ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల పనితీరు అలాగే వీవీ ప్యాట్స్‌పై అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు ఆర్ఐ కిషోర్, రీసర్వే డీటీ పడాల్‌లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాను పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు అదనపు ఆదాయం



అరబుపాలెం సంపద తయారీ కేంద్రం పరిశీలిస్తున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు తెలిపారు. అరబుపాలెం సంపద తయారీ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాల ద్వారా తయారయ్యే వర్మీని వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఈవో ఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కె.టి.రమణలు ఆయన వెంట పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంపై అవగాహన

అచ్యుతాపురం : ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం నిర్వహించారు. పలువురు వినియోగదారులకు, విద్యార్థులకు ఫోరం అందించే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ క్యాంప్ కోర్టు గౌరవ చైర్మన్ బి.సత్యనారాయణ, సభ్యులు శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలకు పదింతల కృషి

- ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- రాత్రిళ్లు ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో పిల్లల ప్రగతిపై ఆరా
- ఉత్తమ ఫలితాలకు విద్యాశాఖ చర్యలు

నక్కపల్లి : ప్రతి స్టూడెంట్‌పై వ్యక్తిగత శ్రద్ధ, ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో పిల్లల ప్రగతిపై సమావేశాలు, ఇంటి వద్ద ఎలా చదువుతున్నారో తెలుసుకునేందుకు ఫోన్‌ద్వారా సమాచార సేకరణ ఇవన్నీ ఏవో కార్పొరేట్ పాఠశాలల్లో కాదు.. జగనన్న ప్రభుత్వంలో విద్యాశాఖ ప్రభుత్వ స్కూళ్లలోసైతం వీటిని అమలు చేసి అద్భుత ఫలితాలు సాధించడానికి కృషి చేస్తోంది. ప్రైవేటు పాఠశాలలు కార్పొరేట్ యాజమాన్యాలు చేయలేని విధంగా పాఠశాలలు పనిదినాలు ముగిసాక ఉపాధ్యాయులకు కొత్త బాధ్యతలు అప్పగించింది.

ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడానికి విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిలో వెనుక బడిన విద్యార్థులను ఏ,బీ, సీ,డీ గ్రేడ్‌లుగా విభజించి తర్ఫీదు ఇవ్వాలని సూచించడంతో పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. వచ్చే నెలలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 400 పైగా పాఠశాలలో సుమారు 30 వేల మందికి పైగా విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. దీంతో పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వీరిని ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వారాంతపు పరీక్షలు నిర్వహించడం, నోట్ పుస్తకాలు క్రమం తప్పకుండా పరిశీలించడం, తప్పులు సరిదిద్దడం సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా చర్యలు చేపట్టారు. వందకు వంద మార్కులు సాధించే దిశగా బట్టీ విధానానికి స్వస్తి పలికి సృజనతో మంచి మార్కులు సాధించేలా తర్ఫీదు నిస్తున్నారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. గతంలో సబ్జెక్టుకు రెండు పేపర్లు ఉండేవని, ఇప్పుడు ఒక పేపరు మాత్రమే ఉండడంతో విద్యార్థులు పరీక్షలు రాయడం మరింత సులభతరమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. రాత్రిపూట ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు, దాతల సహకారంతో అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తున్నారు. నక్కపల్లి మండలం పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక తరగతులకు విశేష స్పందన లభిస్తోంది. విద్యార్థుల కోసం గ్రామపెద్దలు తమకు తోచిన రీతిలో రోజుకొకరు చొప్పున అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. నక్కపల్లి మండలంలో 11 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సుమారు 1165 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు.



బోదిగల్లం పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



రాత్రిపూట దాతల సాయంతో విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేసిన దృశ్యం

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తా..



మా పాఠశాలలో ఎప్పుడూ లేని విధంగా రాత్రి వేళల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని సబ్జెక్టులు సులభ రీతిలో రీతిలో బోధిస్తున్నారు. సందేహాలు నివృత్తి చేస్తున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాననే భరోసా ఏర్పడింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశలు నెరవేరుస్తాను.

– గొర్ల దుర్గా ప్రసాద్, పదో తరగతి విద్యార్థి

చదువుపై ఆసక్తి పెరిగింది



మా పాఠశాలలో విద్యార్థుల అభ్యసన స్థాయిని బట్టి గ్రూపులుగా విభజించారు. చదువుతో పాటు అదనపు తరగతులు కూడా ఏర్పాటు చేశారు. పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు. ఉపాధ్యాయుల వ్యక్తిగత పర్యవేక్షణ బాగుంది. చదువుపై మాకు మరింత ఆసక్తి పెరిగింది.

– నూకరత్నం, పదో తరగతి విద్యార్థిని

ఫలితాలపై నమ్మకం కలిగింది



మా అమ్మాయి ప్రసన్న పదో తరగతి చదువుతోంది. మొదటలో చదువులో బాగా వెనుకబడి ఉండేది. ఇప్పుడు ఉపాధ్యాయులు చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ, అదనపు తరగతుల వల్ల మా అమ్మాయి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తుందనే నమ్మకం కలిగింది.

– కమల, విద్యార్థిని తల్లి

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పదోతరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులకు దత్తత ఇవ్వడం జరిగింది.మెరిట్ ఉన్న విద్యార్థులతోపాటు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. గణితం, సైన్స్ వంటి కఠిన సబ్జెక్టుల్లో మెలకువలు నేర్పి భయం పోగొట్టడం జరుగుతోంది. భౌతిక, రసాయన, జీవశాస్త్రాలపై కూడా మంచి తర్ఫీదు ఇచ్చి సందేహాలు నివృత్తి చేస్తున్నాం. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నాం.

– సత్యనారాయణ హెచ్ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాల బోదిగల్లం

మంచి ఫలితాలు సాధిస్తాం



పట్టిక, గ్రాఫ్‌లు ఇచ్చి సొంతంగా జవాబులు గుర్తించేలా చేస్తున్నాం. మ్యాప్ పాయింట్ చేయించడంలో మెలకువలు నేర్పడం జరుగుతోంది. వారాంతపు పరీక్షలు పెట్టి వారి సామర్థ్యాన్ని అంచనా వేసి అవసరమైతే మరింత తర్ఫీదు ఇవ్వాలని నిర్ణయించాం. విద్యార్థుల నుంచి స్పందన కూడా బాగుంది. మంచి ఫలితాలు సాధిస్తాం.

– ఎ.వి.ఎల్.ఎన్.కుమారి, సోషల్ ఉపాధ్యాయిని

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ శచీదేవి
- లైనుకొత్తూరులో డ్వాక్రా సిబ్బందితో సమావేశం



డ్వాక్రా ఈసీలతో ఆరోగ్యశ్రీ కార్డుల నమోదు ప్రక్రియను వివరిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి



డ్వాక్రా మహిళలతో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

యలమంచిలి : స్వయం సహాయక సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రుణాలు పొందిన మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించి మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుకునేలా కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అన్నారు. యలమంచిలి మండలం లైనుకొత్తూరు గ్రామంలో ఉన్న డ్వాక్రా సంఘాల స్త్రీ శక్తి భవనంలో ఆమె మంగళవారం డ్వాక్రా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్వయం సహాయక సంఘాల ద్వారా అందిస్తున్న వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా మెరుగైన ఉపాధి సాధించేలా డ్వాక్రా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ కార్డుల నమోదు సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఫోన్‌యాప్‌లను ఏవిధంగా వినియోగించాలనే దానిపై నెలవారి సమీక్షల వివరాలు, డ్వాక్రా సంఘాల ద్వారా ఆదాయం పెంపొందించేలా విశ్లేషణ చేసి ప్రణాళిక తయారు చేసి అందించాలని డ్వాక్రా ఈసీలకు సూచించారు. అనంతరం స్థానిక కార్యాలయం నుంచి యలమంచిలి జాతీయ రహదారిపై రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తత కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ వేగ నియంత్రణ పాటించాలని, ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని మానవహారంగా ఏర్పడి నినాదం చేశారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ సిహెచ్ సత్యవేణి, ఏపీఎం ఇస్తేరు రాణీ, స్త్రీనిధి మేనేజరు కరుణానిధి, ఎల్‌సీ, జీవీ రమణ, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం



రైల్వే స్టేషన్ పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ రైల్వే స్టేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం సందడిగా జరిగింది. స్థానిక పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు, తొమ్మిదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా జానపద గీతాలు గ్రామీణ వాతావరణాన్ని ఉట్టిపడే గీతాలకు అబ్బురపరిచే నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గ్రేస్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, పోటీతత్వం అలవర్చుకోవాలని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వనరులతో విద్యను అందించడం గూర్చి సమాజంలో అందరికీ తెలిసేలా వివరించాలని సూచించారు. ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణను అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో కూడిన విద్యను ప్రభుత్వం అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులంతా తమకు ఇష్టమైన రంగాల్లో రాణించేలా ఇప్పటి నుంచే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని, ఇంటర్ విద్యలో రాణించాలని అలాగే పదో తరగతిలో అడుగుపెడుతున్న విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికలు వేసుకోవాలని వచ్చే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రభుత్వ పాఠశాలలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యాక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ, జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపి నేతలు

ఎస్.రాయవరం : పెట్టుగోళ్లపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి 23 వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామికి వేకువజామునుంచి సింధూర, తమలపాకు పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం పురస్కరించుకుని ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, ధూళి శ్రీనుబాబు వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెలగా శ్రీను, నల్లపరాజు వెంకటరాజు, లక్కోజు ఆదిమూర్తి పెద్ద ఎత్తున హాజరై స్వామిని దర్శించుకున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. గ్రామపెద్దలు వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు వరహాలరావు, చొప్పా రాజు, సకురు వెంకటరమణ, వియ్యపు నారాయణరావు మాస్టార్ పాఠశాల కమిటీ చైర్మన్ అల్లు ఏసుబాబు తదితరులు సహాయ సహకారాలు అందించారు. సాయంత్రం గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

300 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో సేవలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో స్వప్న

పాయకరావుపేట : వెంకటనగరం గ్రామంలో 300 మందికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఈశ్వర ప్రసాద్ ఇఎన్‌టీ వైద్య సేవలు, డాక్టర్ రవికిరణ్ ఆర్థోపెడిక్ సేవలు, డాక్టర్ పి.కావ్య రోగులకు సాధారణ వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. గుండె సంబంధిత వ్యాధులకు, కంటికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు మెరుగైన వైద్యం కోసం తగు సూచనలు, సలహాలు అందించారు. ఎంపీడీవో కె.స్వప్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈవోఆర్‌డీ చంద్రశేఖర్, సర్పంచ్ వంకా రమణ, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, పాల్గొన్నారు.

బాలికల్లో రక్తహీనత నివారించాలి

ఎస్.రాయవరం : రక్తహీనతతో బాధపడుతున్న బాలికలు విధిగా వైద్య పరీక్షలు చేయించుకుని పోషకాలుతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సర్వసిద్ధి వైద్యాధికారి వాసంతి తెలిపారు. సర్వసిద్ధి పీహెచ్‌సీలో సైతారుపేట, పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో వమ్మవరం హైస్కూల్లో మంగళవారం ప్రపంచ ఎనీమియా దినోత్సవం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కిశోర బాలికలుగా ఉన్నప్పటినుంచి రక్తహీనత సమస్య ఉంటే జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు.

బదిలీ అయిన ఎంపీడీవోకు సత్కారం



బదిలీపై వెళ్లిన ఎంపీడీవోను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : అంకితభావంతో పని చేసిన ప్రతి అధికారికి తగిన గుర్తింపు లభిస్తుందని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అన్నారు. ఎస్.రాయవరం ఎంపీడీవోగా సేవలందించి ఇటీవల రామచంద్రా పురం మండలం బదిలీపై వెళ్లిన రామచంద్రమూర్తిని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రస్తుత ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న సత్యనారాయణమూర్తిని పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ సత్కరించారు. పంచాయతీ కార్యదర్శులు రమేష్‌బాబు, ప్రసాద్, సత్యనారాయణ, రామలక్ష్మి, చంద్రకళ, రమేష్ పాల్గొన్నారు.

సీఐ విధుల శిక్షణకు ట్రైనీ డీఎస్పీ

యలమంచిలి రూరల్ : యలమంచిలి సీఐ కార్యాలయానికి ట్రైనీ డీఎస్పీ జి. భవ్యా రెడ్డి మంగళవారం వచ్చారు. రెండు నెలల పాటు ఇక్కడ సీఐ విధుల్లో ఆమె శిక్షణ తీసుకుంటారు. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన ఐపీఎస్‌లకు ఈ విధంగా ప్రభుత్వం శిక్షణనిస్తుంది. ఆమె ఇక్కడ సీఐ కార్యాలయంలో మంగళవారం రిపోర్టు చేశారు. సీఐ విధులు, బాధ్యతలు, కార్యాలయ నిర్వహణ, కేసుల దర్యాప్తుపై సీఐ పర్యవేక్షణ, తీవ్రమైన నేరాలకు సంబంధించిన తీరుపై ఆమె ప్రత్యక్షంగా పరిశీలించి శిక్షణ తీసుకుంటారని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్



తిమ్మరాజుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

యలమంచిలి : ప్రజలందరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. యలమంచిలి మండలం పులపర్తి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఫేజ్–2 కార్యక్రమంలో భాగంగా ఆయన అధికారులతో కలసి పరిశీలించారు.జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 లో ప్రజలందరికీ ఉచితంగా వైద్యం అందించి మందులు అందజేస్తుందని ప్రతి ఒక్కరికీ వైద్యులు అందుబాటులో ఉండి పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న ఈ కార్యక్రమం ప్రాధాన్యాన్ని వివరించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారని గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా అత్యవసర వైద్యం అందిస్తున్నారని తెలిపారు. పులపర్తి గ్రామంలో ప్రజలందరికీ మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యులు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు చేశారు. మహిళలు, వృద్ధులు రక్త పరీక్షలు , బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీడీవో అప్పలనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ గ్రామ సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మునగపాక: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. తిమ్మరాజుపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. నిష్ణాతులైన వైద్యులు సేవలందించడంతో పాటు 140 రకాలకు పైగా మందులను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. సర్పంచ్ మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, చూచుకొండ వైద్యాధికారి ఎస్తేర్ రాణి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలుపై దృష్టి సారించాలి



నామవరం గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట : గ్రామాల్లో గ్రామ సచివాలయ కార్యదర్శులు ఇంటి పన్నులు వసూలుపై దృష్టి సారించాలని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నామవరం, పాల్మన్‌పేట, ఈదటం గ్రామాల్లో గ్రామ సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. గ్రామాల్లో సిబ్బంది ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈకేవైసీ అందరికీ పూర్తి చేయాలన్నారు.

ఘనంగా అమ్మవారి పండగ

అచ్యుతాపురం : మండలంలోని పూడిమడకలో మంగళవారం బాపణమ్మ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. నాలుగు శివారు గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొత్త వస్త్రాలు ధరించి ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

ఎంపీడీవో కొండలరావుకు సన్మానం



ఎంపీడీవో కొండలరావును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాంబిల్లి: రాంబిల్లి ఎంపీడీవోగా పనిచేసి బదిలీ అయిన కె.ఎస్. కొండలరావును మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. నాలుగేళ్లకాలంలో ఎంపీడీవోగా కొండలరావు మంచి పనితీరు ప్రదర్శించి మండల అభివృద్ధికి కృషి చేసినట్టు ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి మెరుగైన సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి బి.వి.ఎస్. రాజు, ఈవోపీఆర్డీ రాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న సీఐ బుచ్చిరాజు

అచ్యుతాపురం: కీలకమైన సెజ్ వాహనాలు రాకపోకలు సాగించే అచ్యుతాపురం కూడలిలో నడిపే ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు సూచించారు. అచ్యుతాపురంలో మంగళవారం ఆటో యూనియన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ మోటార్ వాహన చట్టం గురించి వివరించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్రయాణికుల పరిమితి, వేగం వంటి అంశాలపై నిబంధనలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ వాహన డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

వేలాది మంది బ్రాండిక్స్ ఉద్యోగుల రక్షణ బ్రాండిక్స్ వాహనాల డ్రైవర్లపైనే ఆధారపడి ఉందని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు అన్నారు. అచ్యుతాపురంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదుస్సులో ఆయన మాట్లాడారు.పగలు, రాత్రి షిఫ్టులలో బ్రాండిక్స్ బస్సులను నడపే డ్రైవర్లు మరింత అప్రమత్తంగా, చురుకుగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వేగ నియంత్రణ పాటించడంతో పాటు రిమోట్ దారుల్లో వెళ్లేటప్పుడు పరిశీలన ఉండాలని సూచించారు.